క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి సీనియర్ న్యాయవాది, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లు గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి గురువారం పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, కొంపల్లి లింగయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : అనాజిపురంలోని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10 వరకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ కోడి లింగయ్య తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు నేరుగా పాఠశాలలో లేదా సెల్ 9989636205, 7981046143లను సంప్రదించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

అర్వపల్లి : వేల్పుచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంపతి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి మృతదేహానికి గురువారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, తాటిపాముల జలేందర్, మాదగాని విక్రం, వజ్జె రవి, సంపతి విష్ణు, ఊట్కూరి రవీందర్, చెరుకు బాబురావు, విజయ్, శైలేందర్, శ్రీను, మనోజ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తిరుమలగిరి : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యాదగిరి గురువారం ప్రకటనలో తెలి పారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద వెయ్యి రూపాయలు చెల్లించిన వారు తమ డాక్యుమెంట్లు తీసుకొని మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభా గంలో సంప్రదించాలని కోరారు. రెగ్యులరైజేషన్ చేసుకునే వారికి 25 శాతం రాయితీ ఉంటుందని, మార్చి31 వరకు అవకాశం ఉందని తెలిపారు.

హార్వెస్టర్ల యూనియన్ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు


నాగారం : మండల హార్వెస్టర్ల యూనియన్ నూతన మండల కమిటీని గురువారం ఏకగ్రీవం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింగ వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కడారి సైదులు, కార్యదర్శిగా వడ్లకొండ అంజయ్య, కోశాధికారిగా దశరథలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నర్సింగ వెంకన్న మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హార్వెస్టర్ల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ధర్నా

తుంగతుర్తి : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఇటీవల ఎమ్మెల్యే మందుల సామేల్ తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ అరుణ నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తోందని తేలడంతో ఎమ్మెల్యే వెంటనే ఆమెపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. దీంతో గురువారం విద్యార్థులు మా ప్రిన్సిపాల్ మాకు కావాలని పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ క్రాంతికుమార్ పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు సర్దిచెప్పి ధర్నాను విరమింపజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మద్దిరాల పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం. వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ మదారు గ్రామంలోని లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు మదారు ఇంటిపై దాడి చేసి అతడి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 4క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

రేపు 'లయోలా' 50ఏళ్ల వేడుక

- గోల్డెన్ జూబ్లీ సంబరాలకు సిద్ధమైన లయోలా పాఠశాల
- పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



లయోలా పాఠశాల

సూర్యాపేట : సూర్యాపేట మండలం గాంధీనగర్ సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాల 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సిద్ధమైంది. ఈ పాఠశాలను 1975లో ఫాదర్ బాలయ్య, జేసుసభ గురువులు స్థాపించారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎందరో డాక్టర్లు, సినీ పరిశ్రమల్లో, ఇతర దేశాల్లో, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడ్డారు. చదువుకున్న పాఠశాలను ఒక్కసారి చూసి పాత మిత్రులను కలిసేందుకు పూర్వ విద్యార్థులకు గోల్డెన్ జూబ్లీ వేదిక కానుంది. శనివారం(రేపు) ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

1975 నుంచి కొనసాగుతూ..

1975లో స్థాపించబడిన లయోలా పాఠశాలలో 6 నుంచి 10వరకు తరగతులు ఉన్నాయి. మొదట తెలుగు మీడియంలో విద్యాబోధన అందించి 2018 సంవత్సరం వరకు ఎయిడెడ్ పాఠశాలగా కొనసాగించారు. ఆ తర్వాత పూర్తిగా ప్రైవేట్ పాఠశాలను చేసి మొత్తం ఇంగ్లిష్ మీడియం బోధన తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పాఠశాల మొత్తం 35 ఎకరాల్లో ఉంది. ఎందరో జీవితాలను మార్చిన ఈ పాఠశాలను మరొకసారి గుర్తు చేసుకునేందుకు పూర్వ విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి పాఠశాల సహకారంతో గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సిద్ధమవుతున్నారు.

ఎందరో పూర్వ విద్యార్థులు..

ఈ పాఠశాలలో చదివిన ఎందరో పూర్వవిద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. అమెరికా, ఆస్ట్రేలియా, సౌదీఅరేబియా, దుబాయ్ లాంటి దేశాల్లో డాక్టర్లుగా, సైంటిస్ట్‌లుగా, ఇతర గొప్ప రంగాల్లో స్థిరపడి ఉన్నారు. వారందరికీ గోల్డెన్ జూబ్లీ కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానం అందజేశారు.

ప్రముఖులకు ఆహ్వానం..

ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరుకాకున్నారు. ఈ పాఠశాలలోనే చదువుకున్న రాష్ట్ర టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి హాజరుకానున్నారు. అలాగే కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు కోర్ కమిటీ సభ్యులు తెలిపారు.

50 ఏళ్ల తర్వాత కలుసుకోనున్నారు

1975లో స్థాపించిన ఈ పాఠశాలలో మేమంతా చదువుకున్నాం. 1975లో చదువుకున్న మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కూడా రానున్నారు. వారంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడి ఉన్నారు. 50ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోనున్నారు. ఇంకా ఎవరైనా ఈ పాఠశాలలో చదివిన వారు ఉంటే కచ్చితంగా హాజరుకావాలి.

- ఆకారపు రమేష్, కోర్ కమిటీ అధ్యక్షుడు

ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు

ఈ పాఠశాలలో చదివిన ఎందరో పూర్వ విద్యార్థులు ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా కలుసుకొని వారి బాగోగులు తెలుసుకోనున్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పటి గురువులు సైతం వస్తున్నారు. వారికి కూడా సన్మాన కార్యక్రమం జరగనుంది.

- ఫాదర్ సునీల్, పాఠశాల ప్రిన్సిపాల్

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్



మార్కెట్ చైర్‌పర్సన్‌గా ఎల్సోజు చామంతికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం పనిచేయాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. రైతు భరోసా కింద కూడా ఎకరాకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు. రాష్ట్రంలోనే తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంచి గుర్తింపు ఉందని తెలిపారు. మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తొలగించి ఆ స్థానంలో రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారిని పార్టీ గుర్తించి నామినేషన్ పదవులు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, పాలపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం నుంచి తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన బీరవోలు వాసుదేవరెడ్డి, బైరబోయిన సైదులు, తాటిపాముల జలేందర్, రాములును గురువారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, బైరబోయిన మహరాజు, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, పాలెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో రైతుల నిరసన



తుంగతుర్తిలో ఎస్సారెస్పీ కాలువలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తుంగతుర్తి: తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువల ద్వారా గోదావరి జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పలువురు రైతులు ఎస్సారెస్పీ కాలువలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కాలంలో రెండు పంటలకు నీరు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటికి కరువు వచ్చిందన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరి పంటలకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమలో రైతులు వీరబోయిన నాగయ్య, గుజ్జ చందర్‌రావు, పాలడుగు నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

నీటి సామర్థ్యం పెంచాలి

నూతనకల్ : శ్రీరాంసాగర్ రెండో దశ పరిధిలోని కాల్వల్లో నీటి సామర్థ్యం పెంచి పంటలను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సాగునీటిని అందించే 69డీబీఎం ద్వారా నేటి వరకు మండలానికి గోదావరి జలాలు రాలేదని తెలిపారు. రైతులు గోదావరి జలాలపై ఆశలు పెట్టుకొని పంటలను సాగు చేశారని అన్నారు. నీరు లేక చేతికొచ్చిన పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల నీటి సామర్థ్యాన్ని పెంచి నీటిని అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, లింగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

దోమల నుంచి ప్రజలను రక్షించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

భానుపురి : దోమల బారినుంచి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని సీపీఎం సూర్యాపేట వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ కోరారు. గురువారం పార్టీ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణంలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయిందని తెలిపారు. దోమలు వృద్ధి చెంది పట్టణ ప్రజలను పీల్చుకు తింటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే అన్ని వార్డులలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, అర్వపల్లి లింగయ్య, ఒట్టే ఎర్రయ్య, బుద్ధ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



పాఠశాలలో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అర్వపల్లి : రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీఓ గోపి తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిప్పలపల్లి ధర్మయ్య, ఉపాధ్యాయులు, సుధారాణి, ఎస్. వెంకన్న, వేమారెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ప్రధానోపాధ్యాయుడికి నగదు అందజేస్తున్న దాత

పెన్‌పహాడ్ : పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని హెచ్‌ఎం పిండిగి నరసయ్య, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిడి వెంకన్న అన్నారు. గురువారం దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి పైపులు వేయించడానికి సూర్యాపేట కరాటే మాస్టర్ సయ్యద్ రియాజుద్దీన్ రూ.3వేల నగదును హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాయికింద వెంకటేశ్వర్లు, ఎం. విజయ్‌కుమార్, వెంకన్న, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ఆర్డీఓ వేణుమాధవ్‌రావు



మద్దిరాల : జెడ్పీహెచ్చ్‌ఎస్‌లో పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఆత్మకూర్(ఎస్) : పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. గురువారం నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గునగంటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్, ఆర్‌ఐ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రీఫైనల్ పరీక్షల పరిశీలన

మద్దిరాల : 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలను బాగా రాయాలని మండల విద్యాధికారి కాట్ల రవికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు హర్షణీయం

తుంగతుర్తి : కరీంనగర్–మెదక్–నిజామాబాద్–అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలను గెలుచుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు ఇదే నిదర్శనం అని తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు నారాయణదాసు నాగరాజు, కత్తుల నరేష్, గాజుల మహేందర్, ఉప్పుల లింగయ్య, పూసపల్లి శ్రీనివాస్, బొంకూరి నవీన్, పోడేటి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి

మునగాల : గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.నరసింహారావు సిబ్బందికి సూచించారు. గురువారం మునగాల మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పారిజాత, సూపర్‌వైజర్లు సరిత, శ్రీలత, రజని, పోషణ అభియాన్ సిబ్బంది, విద్యాసాగర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రతిరోజూ తప్పనిసరిగా ధ్యానం చేయాలి



అర్వపల్లిలో అభ్యాసకులతో నిర్వాహకులు

అర్వపల్లి : ప్రతి రోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్. గోవర్ధనగిరి కోరారు. అర్వపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా–ధ్యానోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అర్వపల్లిలో ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినందున ప్రతి ఆదివారం ధ్యాన శిక్షణ ఉంటుందని చెప్పారు. స్థానికులతోపాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణకు సహకరించిన వారిని, అభ్యాసకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షకులు ఎం. వెంకటరంగారావు, డాక్టర్ రామారావు, ఉపేందర్, శేఖర్, వెంకటయ్య, ఏపీఎస్. రాజు, అంజన్‌ప్రసాద్, పాండయ్య, రమేష్, ఏడుకొండలు, భూపతి శ్రీనివాస్, సందీప్, రంజిత్, ఉమ, సంతోష, స్వరూప, అభ్యాసకులు మనుబోతుల వీరయ్య, వనం రమేష్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, దిర్శనపు కృష్ణమూర్తి, సుతారపు లక్ష్మమ్మ, చిరంజీవి, వేణు, సతీష్, సందీప్, జ్యోతి, రజిని, ఉమ, శైలజ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరించారు.. వసతులు మరిచారు

- అర్వపల్లి వైజంక్షన్‌లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ
- రహదారి విస్తరణలో టాయిలెట్లు నిర్మించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న జనం



అర్వపల్లిలోని వైజంక్షన్

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిసే కూడలైన అర్వపల్లిలో హైవే అధికారులు టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అర్వపల్లి మీదుగా ప్రతిరోజు వాహనాల రద్దీ పెరుగుతోంది. అర్వపల్లి నుంచి హైదరాబాద్ దగ్గరిదారి కావడంతో చుట్టు పక్కల జిల్లాల ప్రయాణికులు, వాహనచోదకులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ప్రతిరోజు అర్వపల్లికి వేలమంది తమ పనులకోసం వచ్చి వెళ్తుంటారు. కానీ అర్వపల్లి వైజంక్షన్ సమీపంలో కనీసం టాయిలెట్స్‌లేక జనం ఇబ్బందులు పడుతున్నారు.

టాయిలెట్స్‌ను మరిచిన అధికారులు..

రెండు హైవేల కూడలిగా ఉండి వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న అర్వపల్లిలో టాయిలెట్స్ నిర్మాణాన్ని అధికారులు మరిచారు. సూర్యాపేట–జనగామ హైవేపై ట్రక్‌లేబై, టోల్‌ప్లాజాల వద్ద హైవే అధికారులు టాయిలెట్స్ నిర్మించినప్పటికీ ఎంతో అవసరమైన అర్వపల్లిలో మాత్రం వీటి నిర్మాణం చేపట్టలేదు. సులభ్ కాంప్లెక్స్ తరహాలో అర్వపల్లిలో వెంటనే టాయిలెట్స్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నెలల తరబడి పోరాడుతున్నాం



రెండు హైవేల జంక్షనైన అర్వపల్లిలో బస్టాండ్, టాయిలెట్ల నిర్మాణం ఎంతో అవసరం. ఇక్కడ వాటి నిర్మాణం కోసం కొన్ని నెలలుగా రాజకీయాలకు అతీతంగా పోరాడుతున్నాం. అర్వపల్లికి నిత్యం వచ్చిపోయే ప్రయాణికులు, మహిళలు టాయిలెట్స్‌లేక ఇబ్బంది పడుతున్నారు.

- మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

రోజంతా ఇబ్బందే..



మాది జాజిరెడ్డిగూడెం గ్రామం. అర్వపల్లిలో తోపుడు బండి పెట్టుకొని జ్యూస్ అమ్ముతున్నాను. రోజు ఉదయం వచ్చినప్పటినుంచి సాయంత్రం వరకు ఇక్కడే వ్యాపారం చేసుకుంటా. అర్వపల్లి జంక్షన్‌లో కనీసం టాయిలెట్స్ లేకపోవడంతో ఇబ్బంది అవుతోంది.

- వీర్ల సావిత్రి, జాజిరెడ్డిగూడెం

టాయిలెట్స్ నిర్మించాలి



అర్వపల్లిలో టాయిలెట్లను నిర్మించాలి.టాయిలెట్లు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పండ్లు అమ్మడానికి అర్వపల్లికి ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తాను. జంక్షన్ వద్ద టాయిలెట్లు లేకపోవడంతో వ్యాపారులతో పాటు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

- మణిమాల, పండ్ల దుకాణం వ్యాపారి

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.. కేసు నమోదు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం ఉదయం పట్టుకొని కేసు నమోదు చేశారు. మక్తా కొత్తగూడెం గ్రామానికి చెందిన బోయిన గణేష్, గుండాల గణేష్, గుండాల రాకేష్‌లతోపాటు తాళ్ల సింగారం గ్రామానికి చెందిన జటంగి సొనయ్య మొత్తం ఐదు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని ఏరు వెంట ఇసుక తరలించకుండా జేసీబీ సహాయంతో గాతులు పెట్టామని, వాటిని అతిక్రమించి ఎవరైనా ఇసుక రవాణా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నెలరోజులైనా లభించని మహిళ ఆచూకీ

మద్దిరాల: కుంటపల్లి గ్రామానికి చెందిన కుందూరు వసంత అదృశ్యమై నెలరోజులు గడుస్తున్నా ఇంత వరకు ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుందూరు వసంత కుంటపల్లిలో ఆశ వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె ఫిబ్రవరి 4న హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి కనిపించకుండాపోయింది. మద్దిరాలకు చెందిన ఓ వ్యక్తి వసంత కుటుంబంతో స్నేహంగా ఉంటూ.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని ఖమ్మం బైపాస్ వెంట ఉన్న వసంత ప్లాట్‌ను అమ్మి పెట్టినట్లు వసంత కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ప్లాట్ అమ్మగా వచ్చిన రూ.30లక్షలను అతడే తీసుకోని ఇవ్వడం లేదని, ఈ క్రమంలో వసంతను సూర్యాపేటకు పిలిపించి ఆమెను కిడ్నాప్ చేసి ఉండవచ్చని వసంత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ ఎం. వీరన్నను వివరణ కోరగా.. వసంత కనిపించడంలేదని ఆమె భర్త జితేందర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వసంత సూర్యాపేట హైటెక్ బస్టాండ్ వైపు వెళ్తున్నట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డయ్యిందని, ఆ తర్వాత ఆమె ఎక్కడికి వెళ్లిందనేది తెలియలేదన్నారు. ఇటీవల శ్రీశైలంలో ఆమె మొబైల్ లోకేషన్ చూపించినట్లు తెలిపారు. త్వరలోనే ఆమె ఎక్కడ ఉందో తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ అన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళం

కోదాడరూరల్ : మండలంలోని అడ్లూరులో నూతనంగా శివాలయం నిర్మాణానికి రూ.1,53000, అదే విధంగా కోదాడ పట్టణంలోని రామాలయం అభివృద్ధికి రూ.1,53000 ను ఎన్‌ఆర్‌ఐలు నారపరాజు లక్ష్మీనారాయణ– పింగళి అమూల్యరెడ్డి దంపతుల కుమార్తెలు హర్షిణి, మేఘన అందజేశారు. ఆ విరాళాన్ని గురువారం ఆయా ఆలయాల నిర్వాహకులకు విరాళ కమిటీ సభ్యులు అందజేశారు. ఇతర దేశాల్లో స్థిరపడి మాతృభూమిపై ప్రేమతో ఆలయాల అభివృద్ధికి విరాళం అందజేయడం అభినందనీయమని పలువురు అన్నారు. కార్యక్రమంలో సేకు రమేష్, బండారు శ్రీనివాసరావు, జూలూరు బసవయ్య, నరసింహారావు, గరిడేపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కోదాడరూరల్ : గత పదేళ్లుగా పేద ముస్లింలకు బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ మౌలానా అహ్మద్ నద్వి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు ముస్లిం పెద్దలు అన్నారు. గురువారం పట్టణంలోని షాదీఖానాలో బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 700 మంది పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మౌలానా అహ్మద్ నద్వి మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో పేద ముస్లింలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక



అవార్డులకు ఎంపికైన విద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు లింగంపల్లి అశ్విని, వడ్డే ఐశ్వర్యలు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బురహానుద్దీన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను రూపొందించాలని అన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వర్లు, పొన్నాల నర్సయ్య, ఎం.రాజు, చిప్పలపల్లి రవి, కె.రమేష్, ఎండీ రఫీ, ఎన్.ప్రవీణ్‌కుమార్, జి. డేవిడ్, డి.రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాసపత్రిక ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : పాఠశాలలో జరుగుతున్న సృజనాత్మక కార్యక్రమాలను ఒక మాసపత్రిక రూపంలో తీసుకురావడం అభినందనీయమని తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలకు సంబంధించిన ఈవెంట్స్ అండ్ ఆక్టివిటీస్ మాసపత్రికను ఎంఈఓ నకిరేకంటి రవితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మాసపత్రికను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు